# గిరిజనుల నమ్మకాలు – శాంతి ప్రక్రియలు

**డా. హెచ్. కిషన్, అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ తెలుగు, బద్రుక కళాశాల, కాచిగూడ, హైదరాబాద్.**

**ప్రారంభం :** మానవుడు ప్రాథమిక దశలో ప్రకృతిని గూర్చి, ప్రకృతిలోని శక్తులను గూర్చి ఎన్నో కల్పనలకు లోనై నమ్మకాలను రూపొందించుకొంటు తన ప్రయాణాన్ని కొనసాగించాడు. గిరిజనులకు అన్నింటిపైనా నమ్మకాలే ఎక్కువ. వీరు అడవికి సమీపంలో మారుమూల ప్రాంతాల్లో బయటి ప్రపంచానికి దాదాపు సంబంధాలు లేకుండా, ప్రత్యేకమైన జీవనాన్ని గడుపుతూ ఉంటారు. వీరికి మానవాతీత శక్తులమీద నమ్మకం అధికంగా ఉంటుంది. అమాయకత్వం వారి సహజ గుణం మరోమాటలో వీరిని ఆటవిక సంచార జాతులుగా వర్గీకరించాలి. ఈ ఆటవిక సంచార జాతుల్లో అనేక రకాల నమ్మకాలున్నాయి.

**నమ్మకాలు – శాంతి ప్రక్రియలు :** గదబ జాతివారు జంకరి దేవతను వారి పూర్వీకులైన దిశమ్మవారు రతల పోలమ్మ మొదలైన దేవతలను పూజిస్తారు. కోలాము జాతివారు ఆయాక అనే వారి అదిదేవత మరొక పోలకమ్మ అనే గ్రామదేవతను పూజిస్తారు. భిల్లులు, మూకదొరలు, మాలీలు బోడదేవత, జకరదేవత, సంకుదేవత లేక నిశానిదేవత గంగదేవత మొదలగు దేవతలను పూజిస్తే మంచి జరుగుతుందని వీరి విశ్వాసం. ఈ దేవతలు తమను దుష్టశక్తుల నుండి రక్షిస్తుందని గిరిజనుల గట్టి నమ్మకం.

చెంచు జాతివారు ఆకాశమ్మ, భూమ్మ, అమ్మతల్లి, అమ్మవారు ముఖ్యదేవతలు, ఆకాశదేవత అన్ని దేవతలకి పైదేవత అని వీళ్ళ ప్రగాఢ నమ్మకం వీళ్ళు సూర్యుణ్ణి కూడా ఆరాధిస్తారు. మరొక జాతి యానాదులు జాతి ప్రకృతి శక్తుల్ని దేవతలా భావించి పూజిస్తే మంచి జరుగుతుందని భావిస్తారు. వీరు రోగాలన్నీ క్షుద్రదేవతల కోపాలవల్లే కలుగుతాయని, చిల్లంగి ప్రయోగాల వల్ల మూఢ రోగాలు మరణాలు కలుగుతాయనీ వీళ్ళు పూర్తిగా నమ్ముతారు.

కొండ దొరలలో పూజారి చోడి పిండిని ఇంటిలో ఒక మూలలో ఉంచి ఆ పిండిని ఆకులతో కప్పుతాడు. మర్నాడు ఆకులను తొగించి ఆ పిండిపై కోడివిగాని, ఎలుగుబంటివిగాని పాదా గుర్తు కొరకు వెదకుతాడు. అవి చనిపోయిన వారి పాదా గుర్తులుగా కోడి గుర్తులుంటే బంధువుల భావిజీవితం బాగుంటుందని ఎలుగుబంటి పాదం గుర్తులుంటే బాగుండదని ఒక నమ్మకం.

ఆంధ్ తెగవారు తమ గృహదేవత అయిన ఖండోబా, జిగారి భవానీలనే గాక లోహలపై చెక్కబడిన తమ పూర్వీకుల విగ్రహలను కూడా ఆరాధిస్తారు. వారు చైత్రమాసం శుక్ల పక్షం పన్నెండవ రోజైన ద్వాదశి నాడు కలరా మొదలైన వ్యాధుల నుండి రక్షిస్తారని వీరు మహాదేవుని పూజించి జొన్న అంబలితో స్వామిని అర్పించే నమ్మకం వీరిలో అధికంగా ఉంది.

కోయ తెగవారు వరికోతకు వచ్చిన తరువాత మైసమ్మకు మొక్కి కోడిని పోలి చేస్తారు. ఈ సమయంలో కట్టమైసమ్మ, దగ్గర ఒక కోడిని ఉంచి మమ్ములను క్షేమంగా చూడమని దిగుబడి ఎక్కువ రావాలని ప్రార్థిస్తారు. మమ్ములను క్షేమంగా చూడమని దిగుబడి ఎక్కువ రావాలని ప్రార్థిస్తారు. కోడిని కోసి రక్తాన్ని పంటపొలంపై చల్లుతారు. తరువాత ఎవరికి వారు కోడిని కోసి రక్తాన్ని పంటపొలంపై చల్లుతారు. ఆ పిదప ఎవరికి వారు వారి వారి పొలాల దగ్గర చేరి, వరి కట్టలను కుప్పగా పెట్టి కళ్ళం ఏర్పాటు చేసి మొదట కట్టిన కట్టను తీసుకొని పంజా కొడతారు. పంజా కొట్టగ వచ్చిన వడ్లను రాశిగా పోసి ఆ కుప్ప మీద మళ్ళీ మరొక కోడిని లేదా యాటను కోస్తారు. పంట పండించక ముందు పండించిన తర్వాత ఈ విధంగా చేయడం వల్ల దుష్టశక్తులు దగ్గరికి చేరవని వీరి బలమైన విశ్వాసం.

ఈ తెగవారు తమ తమ దేవుళ్ళను ప్రార్థించి రోహిణి సుర్దుల అంటూ ఇప్ప పువ్వును చెంబులో ఉన్న సారాయిలో వేస్తారు. ఆ చెంబులో ఇప్ప పువ్వు మునిగితే వర్షాలు పడ్తాయని, మునగకపోతే వర్షాలు పడవని వీరి నమ్మకం. వీరు రోహిణి కార్తెలో ఆదివారం పండగని నిర్ణయించుకొని, ఆరోజు ఒక పందిని నాల్గు కాళ్ళు కట్టి, కట్టెకు వ్రేలాడదీసి ఊరంత తిరుగుతారు. ఈ ఊరేగింపుకు ఎవరు ఎదురు రాకుడదు. ఎదురు వస్తే కీడు జరగుతుందని నమ్మతారు. వీరు ఆ విధంగా తిరుగుతూ తమ పిల్లా, గొడ్డు మరియు గోదా చక్కగా ఉండాలని కోరి, చివరికి భూదేవి దగ్గరికి తీసుకెళ్ళి పసుపు, కుంకుమ రాసి పూలదండవేసి, బోనం పెట్టి కోరవి ముట్టించి ఆ పందిని కోసి బలి ఇస్తారు. కొంత ధాన్యాన్ని ఆ రక్తంలో కలుపుతారు. ఈ విధంగా చేయడం వల్ల పంటలు బాగా పండుతాయని నమ్మకం.

సవర తెగవారు తమ పూర్వీకుల ఆత్మశాంతి కోసం తమ పొలాలలో పండిన అన్ని రకాలైన ధాన్యపు గింజలను ఒక కుండలో ఉంచి ఇంటి ముందు కడ్తారు. ఇలా కట్టడం వల్ల తమ పూర్వీకులు వచ్చి తినిపోవడానికి అందుబాటులో ఉంటుందని వీరి నమ్మకం.

గిరిజనులు సమ్మక్క, సారలమ్మ దేవతకు మొక్కుబడులలో బంగారం (బెల్లం) వడియాలు బియ్యం, కొబ్బరికాయలు, పసుపుకుంకుమలు, చీరరవిక, బోనాలు తదితర మొక్కుబడులు చెల్లిస్తే తమ కోరుకున్న కోరికలు ఆ దేవతలు తీర్చుతుందని వీరి నమ్మకం.

బంజారాల్లో శిశువు పుట్టిన తర్వాత నాళో (పేగు లేదా మాయిను) కొడవలితో లేదా రాయితో కోసి వేరు చేస్తారు. ఆ పిమ్మట ఇంటికి ఈశాన్యంలో ఒక గుంతను తవ్వి ప్రేగును ఒక పావలా బిళ్ళను, జొన్నపిండిని అందులో వేసి పూడ్చేస్తారు. అలా చేస్తే తల్లికి, బిడ్డకూ ఎలాంటి హాని జరగదని వీరి నమ్మకం, పెళ్ళిలో వరుడికి దాండియా అనబడే ఒక పరికరాన్ని చేతికిస్తారు. ఇది చేతిలో ఉంటే ఏవిధమైన దృష్టిదోషముండదని మరొక నమ్మకం.

వరుడు పెండ్లి చేసుకోవడం కోసం అతడిపైన ఒక దుప్పటి కప్పుతారు. తర్వాత అతని ఎదురుగా, సమీప బంధువు ఎవరైనా వచ్చి ఒక నాణాన్ని బొటన వేలి సహాయంతో ఎగురవేస్తారు. బొమ్మ, బొడుసుల కోసం చూస్తారు. బొమ్మ పడితే వరుడు పెళ్లి చేసుకొని క్షేమంగా తిరిగి వస్తాడని, బొరుసు పడితే అపశకునం కల్గుతుందని ఒక విశ్వాసం. మరొకటి పెళ్ళి పందిరిలో రెండు రోకళ్ళకు మెండల్ కాయలు (జీడిగింజలు) గవ్వను జతపర్చి కడ్తారు. వధూవరులకు ఎవరి దిష్టి తగలకుండా కాపాడుతుందని వీరి నమ్మకం.

ఇంకొకటి చిన్న వయస్సులో చనిపోయినవాళ్ళు, గర్భవతిస్త్రీ, బాలెంత మొదలగు వాళ్ళు చనిపోతే దయ్యాలవుతారని భావించి జంతుబలిని ఇచ్చి శాంతి చేస్తారు. లేకుంటే దయ్యమై నష్టం జరుగుతుందని నమ్మతారు. క్షుద్ర పూజలపైన వీరికి అధికమైన నమ్మకం. కాబట్టి వీరు దేవతలను సంతోషపెట్టడానికీ, తమ కోర్కెలు నెరవేర్చుకోవడానికి శత్రువుల మీద కక్ష సాధించడానికి వీటిని ఉపయోగిస్తారు. ప్రయోగాల పేరుతో ఇటువంటి అనేక విశ్వాసాలు ఎక్కువగా ఉంటాయి.

వీరు తమ రోగాలకు వైద్యం చేసుకోవడం అంటే దేవతలకు నైవేద్యాలు బలులు ఇస్తారు. ఈ విధంగా ఇవ్వడం వల్ల వారికి ఏవిధమైన కీడు జరగదని భావిస్తారు. చనిపోయిన వీరి ఆత్మశాంతికోసం యాటను కోస్తారు. ! రెండు, మూడు సంవత్సరాల కొకసారి చేయడం వల్ల పిల్లా, జెల్లా, గొడ్డు, గోదాలు ఆరోగ్యంగా ఉంటాయని నమ్మకం.

గిరిజన తెగల్లో జంతు బలులతో పాటు, భక్తితో పూజించే నమ్మకం కూడా కనిపిస్తుంది. ఖోండ్ తెగలో చేప, పీత గూడ లేడి మొదలైన జంతువులు కులదేవతలుగా ఉన్నాయని, రాజ్ గోండ్ తెగలో తాబేలు ముళ్ళపంది, పెద్దపులి, పాము కులదేవతలుగా ఉన్నాయని, నవరలు సుడదేవతను, కులదేవతలుగా ఉన్నాయని, బంజారాలు గొండులు వరసపెన్ను (గోత దేవత) ను ఆకిసన్ గ్రామాన్ని కాపాడే దేవతను అవల్ గ్రామ దేవతను, నాగుభసర్వదేవతనం, భీమన్న అను దేవతలను పూజిస్తారు.

సీత్లా భవానీ పండుగ, తీజ్ పండుగ మొదలైనవి నిర్వహించుకోవడం వల్ల భూత ప్రేతాలు, గాయి, గత్తర (కలరా) లాంటివి వీరికి సోకవని విశ్వసిస్తారు. మేకపోతు నెత్తురు నైవేద్యాన్ని (అన్నం) కలిపి పశువులపై చల్లుతారు. ఇందువల్ల పశుసంపద అభివృద్ధి చెందుతుందని నమ్ముతారు.

మేకపోతు బలి సమయంలో జడత ఇవ్వనిచో తమ మొక్కును దేవతలు స్వీకరించడం లేదని భావిస్తారు. జడత ఇస్తేనే బలి ఇస్తారు. పడుకునే ముందు గడపవద్ద కొడవలి గాని, చీపిరికట్టగాని, కత్తిగాని, గొడ్డలిగాని వేస్తే దయ్యాలు ఇంట్లోనికి రావని వీరి విశ్వాసం.

తీజ్ సమయంలో తీజ మొక్కలు పచ్చగా చక్కగా ఎత్తు పెరిగితే వారికి శుభాలు కలుగుతాయని భావిస్తారు. ఆ పండుగ తొమ్మిది రోజుల్లో అంటుముట్టు తగిలినా ఉప్పుకారం, మాడిన పదార్థాలు వారు సేవించినా వారి పవిత్రతకు భంగం ఏర్పడి మొక్కలు మాడిపోతాయని విశ్వసిస్తారు.

అంత్యక్రియల సమయంలో శవయాత్ర మొదలు పెట్టేటప్పుడు పాము, తేలు, పిల్లి, తుమ్ము మొదలైనవి ఎదురైతే అపశకునాలుగా భావిస్తారు. దహన సంస్కారాలు పూర్తియైన తర్వాత అపశకునం ఎదురైన చోట మేకపోతును బలి ఇచ్చి శాంతి చేయాలి. చేయకపోతే ఏదైనా ప్రమాదం వాటిల్లుతుందని వీరి నమ్మకం. దహనం అయిపోయిన తర్వాత ఇంటికి వచ్చేటప్పుడు దారిలో రేగు ఆకు నోట్లో పెట్టుకొని కొరికి కింద పడవేసి చెట్టు చుట్టు తిరిగి వస్తారు. మరణించిన వారు దయ్యమై వెంటరారని ముఖ్యంగా ఆకు దాటిరారని వీరి బలమైన నమ్మకం.

వీరికి మంత్ర తంత్రాలు పైన ఎంతో నమ్మకం ఉంటుంది. చిన్న చిన్న రోగాలు, వాంతులు విరేచనాలైన ఏవో భూత ప్రేతాలు మహిమేయని మంత్రగాళ్ళను సంప్రదిస్తారు. వారు మంత్రించి ఇచ్చిన తాయతులు కట్టుకుంటే తగ్గిపోతుందని వీరి నమ్మకం.

చీపిరి కట్ట, రోలు, రోకలి, చేటలకు కాలు తగిలితే వెంటనే వీరు మొక్కుతారు. వీటిని దైవంగా, భావించుతారు. ఈ విధంగా మొక్కడం వల్ల దోషం పోతుందని వీరి అధికమైన నమ్మకం.

**శుభాలు :** రెండు తుమ్ములు, మగనక్క అరవడం, పాడె ఎదురైతే, నిండుబిందె ఎదురవడం, ఎడమ నుండి కుడికి పాము వెళ్ళడం, పాలపిట్ట కనిపించడం, చాకలి మైలబట్టలతో ఎదురవడం, ఎడమ నుండి కుడికి పిల్లి వెళ్ళడం, దారిలో ఎదురుపడిన ఉడుమును చంపుకొని తినడం మొదలైనవి శుభ శకునాలుగా మంచి జరుగుతుందని వీరి నమ్మకం.

వీరు ఏదైన శుభకార్యానికి వెళ్ళేటప్పుడు ఒక తుమ్ము తుమ్మితే ప్రయాణం ఆ రోజుకు ఆపుకొని మరునాడు బయలుదేరుతారు. అత్యవసరమైన కొంతసేపు కూర్చొని బీడిగాని, చుట్టగాని, నీళ్ళుగాని తాగాక ప్రయాణం ప్రారంభిస్తారు. నిండు బిందె ఎదురైతే రూపాయి నాణెం అందులో వేసి ముందు వెళతారు. ఈ విధంగా చేసి వెళ్ళితే మంచి జరుగుతుందని వీరి విశ్వాసం.

**అశుభాలు :** ఒక తుమ్ము, కత్తెర దారిలో దొరకడం, కొత్త గంపలు ఎదురవడం, కుమ్మరి కొత్త కుండలు ఎదురవడం, ఖాళీ బిందె ఎదురవడం, కుడి నుండి ఎడమకు పాము వెళ్ళడం. ఆడ నక్క అరవడం, తలపాగ కింద పడడం, కుక్క చెవులు కొట్టడం శవ సంస్కారాలు చేసి వస్తున్న జనం ఎదురవడం కొత్త చీపిరి కట్ట ఎదురవడం, డబ్బులు దొరకడం, కట్టెల మోపు ఎదురవడం మొదలైనవి. అశుభ శకునాలుగా భావించి బంజారాలకు కీడు జరుగుతుందని వీరి నమ్మకం.

తొలితరం మానవుల నమ్మకాలను, విశ్వాసాలను నేటికి ఆచరిస్తున్నారు. ఇలా ఎన్నైనా చెప్పుకోవచ్చు. వీరి నమ్మకాలు కోకొల్లాలుగా ఉన్నాయి. నమ్మకాల విశ్వాసం పునాదిగా, గిరిజనుల జీవితం అనాడు కొనసాగింది. వీళ్ళు జీవితాంతం మూఢనమ్మకాలతోనే బతుకుతారు. నేటికి ఆ విశ్వాసాలు ఆచారాలుగా మిగిలాయి.

వివిధ సందర్భాలతో వారి నమ్మకాలు శాంతి ప్రక్రియలుగా నేటికి ఆచరణలో ఉన్నాయి.

**ఆధారగ్రంథాలు :**


1. బుడిగె జంగాలు, భాషా సాహిత్య సాంస్కృతిక పరిశీలన
2. తెలుగు జానపద విజ్ఞానం, సమాజం – సంస్కృతి – సాహిత్యం
3. నల్లగొండ జిల్లా బంజారా సాహిత్యం – జీవన చిత్రణ
4. సుగాలి సంస్కృతి – భాషా సాహిత్యం 5. మేడారం సమ్మక్క సారలమ్మ జాతర
6. నల్లమలలో చెంచు ప్రభావం 7. బంజారా చరిత్ర, సంస్కృతి – ప్రగతి 8. భారతీయ గిరిజనులు